ఓపెన్ డిగ్రీలో ప్రవేశాలు ప్రారంభం

అచ్చంపేట, జూలై 29 : బల్మూర్ మండలం కొండనాగుల డిగ్రీ కళాశాలలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో 2024-2025 విద్యా సంవత్సరానికి డిగ్రీలో చేరేందుకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల లెర్నింగ్ సపోర్ట్ సెంటర్ కో ఆర్డినేటర్ పరిగి రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. బీఎస్సీలో ప్రవేశానికి ఇంటర్ సైన్స్, మ్యాథ్స్ గ్రూపు అభ్యర్థులు, పదో తరగతి తర్వాత రెండేళ్లు ఒకేషనల్ కోర్సులు చేసిన వారు, ఇంటర్మీడియట్ సర్టిఫికేట్ లేదా సమాన స్థాయి కలిగిన నేషనల్ ఓపెన్ స్కూల్ విద్యా అర్హత కలిగిన విద్యార్థులు ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. ఆయా కోర్సుల్లో చేరడానికి విద్యార్హతలు, ఫీజు కోర్సులు తదితర వివరాల కొసం వెబ్‌సైట్ www.braouonline.in. లేదా www.braou.ac.in లో చూడాలని కోరారు. ఓపెన్ డిగ్రీలో ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు వచ్చే నెల 18 వరకు ట్యూషన్ ఫీజు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని సూచించారు. వివరాలకు 7382929743 నెంబర్‌కు సంప్రదించాలని కోరారు.

సాధారణ బదిలీ భాగంలో పంచాయతీ కార్యదర్శుల రాక

అచ్చంపేట రూరల్, జూలై 29: తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సాధారణ బదిలీలో భాగంగా మండలంలోని సింగారం, సిద్దాపూర్, అంకిరోనిపల్లి, చెంచుపలుగు తండా, ఘణపూర్, కన్యతండా, పెద్దతండా, బోల్డట్‌పల్లి గ్రామ పంచాయతీలకు కార్యదర్శులను ప్రభుత్వం నియమించినట్లు ఎంపీడీవో మధుసూదన్ గౌడ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఎన్.ఆంజనేయులు-సిద్దాపూర్, ఎస్.విష్ణు-చెంచుపలుగుతండా, ఎం.జవాహర్‌లాల్-ఘణపూర్, ఆర్.భగవాన్ -కన్యతండా, కె.మంజూల-సింగారం, ఎం.లక్ష్మి-బోల్గాట్‌పల్లి, రావూఫోద్దీన్ -పెద్దతండాలకు నూతనంగా పంచాయతీ కార్యదర్శులుగా నియమించబడ్డారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

బల్మూరు, జూలై 29 : మండలకేంద్రానికి చెందిన ప్రముఖ జ్యోతిష నిపుణులు, రంగస్థల నాటక కళాకారుడు తిరుమల కృష్ణమాచార్యులు అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయా పార్టీల నాయకులు సోమవారం ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబానికి ప్రగఢసంతాపం, సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన అంతిమయాత్రలో పాల్గొన్నారు.

బహుజన ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవం

అచ్చంపేటటౌన్, జూలై 29 : అచ్చంపేట పట్టణంలో బహుజన ఉపాధ్యాయ సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించినట్లు ఆ సంఘం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గాజుల వెంకటేశ్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు రవీందర్, నాయకులు శ్రీనివాసులు, భూపతికుమార్, రంజిత్ కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విరాళం అందజేత

ఊర్కొండ, జూలై 29: మండలంలోని ఊర్కొండ పేటలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు కొనసాగుతున్న విరాళాల్లో భాగంగా సోమవారం గ్రామ రెవెన్యూ పరిధిలోని న్యూ సూర్యలత కాటన్ మిల్ పీవో, రామాంజన్‌రెడ్డి గ్రామ నాయకులకు రూ.8వేలను అందజేశారు. కార్యక్రమంలో అషు, మనోహర్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని ఆరోగ్య ఉపకేంద్రం

పాలెంలో నిరుపయోగంగా ఉన్న ఆరోగ్య ఉపకేంద్రం

బిజినేపల్లి, జూలై 29: మండలంలోని పాలెం ఆరోగ్య ఉపకేంద్రం నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. కేసీఆర్ ప్రభుత్వ పాలనలో గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 24-06-2023న నాటి ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి శంకుస్థాపన చేశారు. కాగా నేటికీ ఏడాది గడుస్తున్నా ప్రాథమిక ఆరోగ్య ఉ పకేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. భవన నిర్మాణ పనులు 90శాతం పూర్తికాగా ప్రారంభించి అందుబాటులోకి తేలేదు. దీంతో గ్రామాల ప్రజలు ఇ బ్బందులకు గురవుతున్నారు.

రూ.20లక్షల వ్యయంతో ఈ భవనాన్ని నిర్మించారు. అధికారులు స్పందించి ఆరోగ్య ఉప కేంద్రాన్ని అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

'ఒరిగిన' నిర్లక్ష్యం

- ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

ఒరిగి ఉన్న ఇనుప స్తంభం

చారకొండ, జూలై 29: ముందే వర్షాకాలం సిమెంట్ స్తంభాల వద్ద కూడా విద్యుదాఘాత ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్ శాఖలో ఇనుప స్తంభాల వాడకాన్ని చాలా ఏండ్ల కిందనే నిషేధించారు. అయినా మండలంలో పలు గ్రామాల్లో నేటికీ ఇనుప స్తంభాలు దర్శనమిస్తున్నాయి. మండలంలోని మర్రిపల్లిలో జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారి సమీపంలోనే ఇండ్ల ఎదుట చాలా కాలం నుంచి ఇనుప స్తంభం ఏర్పాటు చేశారు. గతంలో ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభాన్ని లారీ ఢీకొట్టడంతో ఆ స్తంభం పూర్తిగా ఒకే వైపు ఒరిగిన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు చూసిచూడన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇనుప స్తంభం ఇంటి ఆరుబయటనే ఉండడంతో భయందోళనకు గురవుతున్నారు. వర్షం వచ్చినప్పుడు కరెంట్ తీగలు తెగి కిందపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ఒరిగి ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని తొలగించి, సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం వస్తే బయటికి వెళ్లాలంటే భయం..

మాఇంటి ఎదుట చాలా ఏళ్లుగా ఇనుప స్తంభం ఒరిగి ఉంది. మాఇంట్లో చిన్నపిల్లలు ఉండడంతో ఎప్పుడు ఎం జరుగుతుందో నని భయం వేస్తుంది. ఈదురు గాలులు, వర్షం వచ్చినప్పుడు బయటికి వెళ్లడం లేదు. కరెంట్ అధికారులకు ఎన్నిసార్లు చెప్పిన పట్టించుకోవడం లేదు. ఇనుప స్తంభాన్ని తొలగించి, సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలి.

- నూనె చంద్రయ్య, మర్రిపల్లి

ఇనుప స్తంభాన్ని తొలగిస్తాం

మర్రిపల్లిలోని ఇండ్ల ఎదుట ఇసుప స్తంభం ప్రమాదకరంగా ఉన్నది వాస్తవమే. ఉన్నాతాధికారులకు దృష్టికి తీసుకెళ్లి, ఇనుప స్తంభాన్ని తొలగించి, 9మీటర్ల సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. వర్షంలో స్తంభాలను ముట్టుకోవద్దని, బోరు మోటర్ల వద్ద కూడా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

- జానకీరాంనాయక్, విద్యుత్ ఏఈ చారకొండ

వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- డీఎఫ్‌వో జయదేవ్

ఎర్రపెంట బేస్‌క్యాంపు వద్ద మొక్కలు నాటుతున్న డీఎఫ్‌వో జయదేవ్,సిబ్బంది

లింగాల, జూలై 29 : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని డీఎఫ్‌వో జయదేవ్ అన్నారు. ప్రపంచ పులుల దినోత్సవాలన్ని పురష్కరించుకొని సోమవారం మండలంలోని ఎర్రపెంట, ధారారం, అప్పాయిపల్లి గ్రామాల్లో శివారులో బేస్ క్యాంపుల వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో జయదేవ్ మాట్లాడుతూ అటవీ ప్రాంతాల్లో వన్యప్రాణులు సహజీవం కోసం అడవులను వేపుగా పెంచాలన్నారు. ముఖ్యంగా అడవులను వేపుగా పెంచాలంటే మొక్కలను నాటి వాటిని సంరక్షించినప్పుడే లక్ష్యం నెరవేరుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో రాంబాబు, ఎఫ్‌బీవోలు ఖాదర్‌పాషా, శివాజీ, నాగార్జున గౌడ్, కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీశైల క్షేత్రంలో ప్రముఖులు

శ్రీశైలం, జూలై 29 : శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఈ వి వేణుగోపాల్, ఆంధ్రప్రదేశ్ డిజిపి ఆర్కే మీనా ఐపీస్ లు దర్శించుకున్నారు. సోమవారం తెల్లవారుజామున శ్రీకృష్ణరాయ గోపురం వద్దకు చేరుకున్న వారికి ఈవో పెద్దిరాజు అర్చక వేద పండితులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వారు శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి అమ్మవార్లకు అభిషేక కుంకుమార్చనలు చేసుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేద పండితుల వేద ఆశీర్వచనం చేయించి స్వామి వారి చిత్రపటం ప్రసాదము జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో ఈవో పెద్దిరాజుతోపాటు ఆలయ అధికారులు శ్రీశైలం వన్ టౌన్ సీఐ ప్రసాద్ రావులు పాల్గొన్నారు.

అధికారులు గ్రామాల్లో పర్యటించాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు

మంతటిలో సమస్యలు తెలుసుకుంటున్న నాయకులు

నాగర్‌కర్నూల్, జూలై 29: పేరుకు మాత్రమే స్పెషల్ ఆఫీసర్లుగా అధికారులు చెలామణి అవుతున్నారని ఏ గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్న పాపనపోవడంలేదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు విమర్శించారు. సోమవారం నాగర్‌కర్నూల్ మండలం మంతటి గ్రామంలో సీపీఎం బృందం పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో గ్రామ ప్రజల్ని పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. ప్రస్తుత వర్షాకాలంలో డ్రైనేజీల వద్ద బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని, తాగునీటి, విద్యుత్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రత్యేకాధికారులు గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాల్సిన బాధ్యత వారిపై ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసులు, అశోక్, ఆవేద, తిరుపతయ్య, వెంకటయ్య, బాలరాజు, నర్సింహ పాల్గొన్నారు.

రాజాపూర్‌లో సమస్యలను పరిష్కరించాలి

రాజాపూర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న నాయకులు

కోడేరు, జూలై 29 : మండలంలోని రాజాపూర్‌లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ డిమాండ్ చేశారు. సమస్యల ఆధ్యాయన యాత్రలో భాగంగా సోమవారం రాజాపూర్‌లో సీపీఎం ప్రతినిధి బృందం పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి పలు సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీల్లో డ్రైనేజీల సమస్యతో మురుగునీరు నిల్వ ఉండి అపరిశుభ్రతతో వ్యాధులకు నిలయంగా మారయన్నారు. వర్షాకాలం కావడంతో పారిశుధ్యం పనులను చేపట్టనందున రోగాలు వచ్చే అవకాశాలు చాలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామంలోని వివిధ రకాల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ మాలిక్, వెంకటమ్మ, బుచ్చన్న, కురుమయ్య, నాగేంద్రం, రాజు, ఆంజనేయులు, భగవంతు, నాగమ్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొత్త పీర్ల వేడుకలు



వంగూరు : పీర్ల వద్ద పూజలు చేస్తున్న పొల్కంపల్లి గ్రామస్తులు

లింగాల : కౌడి పీర్లను ఊరేగిస్తున్న భక్తులు

వంగూరు, జూలై 29: మండలంలోని పొల్కంపల్లిలో సోమవారం ఘనంగా కొత్త పీర్ల వేడుకలు ఘనంగా నిర్వహించారు. పొల్కంపల్లిలో నిర్వహించే కొత్త పీర్ల వేడుకలకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ వేడుకల కోసం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలే కాకుండా ఆగ్రామానికి చెందిన వివిధ ప్రాంతాలో ఉండే గ్రామస్తులు, బంధువులు పెద్ద ఎత్తున్న హాజరవుతారు. ముఖ్యమైన ప్రజాప్రతినిధులు ఈ వేడుకల సమయంలో వచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకొంటారు. గ్రామం నుంచి పెద్ద ఎత్తున్న యువతీ, యువకులతోపాటు చిన్నారులు, వృద్ధులు తేడా లేకుండా అలావ్ చుట్టూ ఆటలాడుతూ వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు.

జూపల్లిలో..

చారకొండ, జూలై 29: మండలంలోని జూపల్లిలో కొత్త పీర్ల పండుగ వేడుకలు కొనసాగుతున్నాయి. సోమవారం కొత్త పీర్ల ఏర్పాటు చేసిన చావడి వద్ద పీర్లను వెల్దండ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి భాస్కర్‌రావు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా 45 తులాల వెండీతో పీర్లకు నూతన దట్టిల అభరణాలు చేయించారు. కులమతాలకు ప్రతీకగా పీర్ల పండుగ నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌గౌడ్, నిర్వాహకులు సిరాజ్, అక్రం, షబీర్ పాల్గొన్నారు.

లింగాల, బల్మూరు మండలాల్లో..

లింగాల/బల్మూరు, జూలై 29 : మండలంలోని ఆయా పల్లెల్లో కౌడీ పీర్ల ఉత్సవాలను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అంబట్‌పల్లిలో పీర్ల మసీదులో కౌడీ పీర్లను ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. హిందూ, ముస్లిం అనే తేడా లేకుండా భక్తులు కౌడీ పీర్లను దర్శించుకొని తమ మొక్కులను చెల్లించుకున్నారు. బల్మూరు మండలంలోని గట్టుతుమ్మెన్, అనంతవరం, పోల్లెపల్లి గ్రామాల్లో చిన్న పీర్ల పండుగ వేడుకలు ఘనంగా ముగిశాయి. సోమవారం ఉదయం పీర్లను గ్రామాల్లో ఉరేగించారు. కార్యక్రమంలో పరశురాం,బాలస్వామి ఉన్నారు.

మొక్కలు నాటుతున్న ఉపాధిహామీ కూలీలు

మొక్కలు నాటి సంరక్షించాలి

- ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్

చారకొండ, జూలై 29 : మండలంలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో ఇసాక్‌హుస్సేన్ అన్నారు. నమస్తే తెలంగాణలో వచ్చిన 'మొక్కలు తెచ్చారు వదిలేశారు' శీర్షికకు స్పందించిన అధికారులు సోమవారం మొక్కలు నాట్టేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వనమహోత్సవ కార్యక్రమంలో మొక్కలపై నిర్లక్ష్యం వహించొద్దని, జీపీలు టార్గెట్ ప్రకారం మొక్కలు నాటాలని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేశ్, ఫీల్డ్‌అసిస్టెంట్ నరేశ్ ఉన్నారు.

శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో బోనాల సంబురాలు

సంబురాలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

అచ్చంపేటటౌన్, జూలై 29 : అచ్చంపేట పట్టణంలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో బోనాల సంబురాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ శ్రీవిద్య మాట్లాడుతూ బోనం అంటే భోజనం కుండ అనే మరో అర్థం కూడా ఉన్నదని కొత్త మట్టి కుండకు పసుపు రాసి కుంకుమ బొట్టు పెట్టి వేపాకులను జడగా అల్లి కుండకు కడతారని తెలంగాణ పండుగను అభివర్ణించారు. అనంతరం పోతురాజు పాటలు, డప్పులతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారని విద్యార్థులకు తెలంగాణా సంస్కృతి పండుగను వివరించారు. కార్యక్రమంలో ఏజీఎం భాస్కర్‌రెడ్డి, చైర్మన్ శ్రీధర్, ప్రిన్సిపాల్ ఎస్‌వీ రాజు, తిరుపతయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ దీక్ష పోస్టర్ విడుదల

పెద్దకొత్తపల్లి, జూలై 29 : ఎస్సీ వర్గాకరణ చేపట్టాలని ఢిల్లీలో చేపట్టే నిరాహారదీక్షకు సంబంధించిన వాల్ పోస్టర్లను సోమవారం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య మాట్లాడుతూ కేంద్రం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చకపోవడంతో టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీను ఢిల్లీలో ఎస్సీ వర్గాకరణ కొరకు నిరాహారదీక్ష చేపడుతున్నట్లు వెల్లడించారు. దీక్షకు మద్ధతుగా జిల్లాలోని ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఊర్కొండ, జూలై 29: దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం ఊర్కొండ గుట్టపై పనిచేసే విషయంలో తిరుపాల్ వద్ద పనిచేసే వ్యక్తి మరొకరి దగ్గరకు పని చేసేందుకు వెళ్లాడు. ఆదివారం రాత్రి గొడవ పడడంతో గొడవ పడకుండా మాట్లాడుకోవాలని చెప్పేందుకు వెళ్లిన ఆంజనేయులును తిరుపాల్ గ్రామంలో రెండుకిలోల ఇనుప బాటుతో తలపై కొ ట్టాడు. దీంతో తలకు గాయమై ఆంజనేయులును కుటుంబ సభ్యులు కల్వకుర్తి దవాఖానకు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై

పాపన్న జయంతిని విజయవంతం చేయాలి

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్, జూలై 29 : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆగస్టు 11వ తేదీన నిర్వహించే శ్రీసర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని జైగౌడ ఉద్యమం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు గుండ్రాతి నారాయణగౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ కల్పనాభాస్కర్‌గౌడ్, మహిళా జిల్లా అధ్యక్షురాలు సోమ ప్రగతిగౌడ్ కోరారు. ఈమేరకు సోమవారం నాగర్‌కర్నూల్‌లో గౌడ సంఘం ఆధ్వర్యంలో జయంతి ఉత్సవాల పోస్టర్లను విడుదల చేశా రు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని పాత మార్కెట్ ఆవరణలో ఇటీవల ఆవిష్కరించిన పాపన్నగౌడ్ విగ్నహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గౌడ కులస్తులు ఐక్యతను చాటుటకు, సమస్యల పరిష్కరానికి గౌడ కులస్తులు పాల్గొని సర్వాయి పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, రమేశ్ గౌడ్, హరీశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, నిర్మలగౌడ్, పుష్పగౌడ్, రంజిత్‌గౌడ్, శేఖర్‌గౌడ్, రాజుగౌడ, శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, యుగంధర్‌గౌడ్, నర్సింహాగౌడ్, ఉమాపతిగౌడ్, రామన్‌గౌడ్, వెంకటస్వామిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యబృందం

వైద్యశిబిరం విజయవంతం

కల్వకుర్తిరూరల్, జూలై 29 : మండలంలోని తర్నికల్‌లో కల్వకుర్తి వెంకటరమణ దవాఖాన ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. శిబిరంలో గ్రామానికి చెందిన వందమందికి ఉచితంగా బ్లడ్, కొలస్ట్రాల్ పరీక్షలను నిర్వహించి తగిన మందులు అందజేశారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి కన్వీనర్ సురేశ్‌గౌడ్, మాజీ కోఆప్షన్ రుక్నుద్దీన్, వైద్య సిబ్బంది అనిల్, కిరణ్, ప్రణయ్, ప్రశాంత్, నందు, సత్యనారాయణ, శ్రీను ఉన్నారు.

మాజీ సర్పంచ్‌కు నాయకుల పరామర్శ

కోడేరు, జూలై 29 : మండలంలోని తీగలపల్లి మాజీ సర్పంచ్ శివారెడ్డికి ఇటీవల చాతిలో నొప్పి రావడంతో చికిత్స కోసం హైదరాబాద్ మలక్‌పేటలోని యశోద దవాఖానలో చేరారు. పరీక్షించిన డాక్టర్లు ఆపరేష న్ చేసి స్టంట్ వేశారు. అనంతరం ఇంటికి చేరుకున్న శివారెడ్డిని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి, తాలూకా నాయకుడు పవన్‌రెడ్డి, మండలాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్‌లు సోమవారం హైదరాబాద్‌లో తన నివాసంలో పరామర్శించారు. వీరివెంట పూర్ణచంద్రారెడ్డి, సురేశ్‌రెడ్డి ఉన్నారు.

కల్వకుర్తి రూరల్ : ఆర్థికసాయం అందజేస్తున్న ఉప్పల ఫౌండేషన్ సభ్యులు

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

పెద్దకొత్తపల్లి : ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

పెద్దకొత్తపల్లి/ఊర్కొండ/కల్వకుర్తి రూరల్, జూలై 29: పెద్దకొత్తపల్లి మండలం చెన్నపురావుపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఆర్ఎంపీ డాక్టర్ షకీర్ కుటుంబానికి మండల ఆర్ఎంపీ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా ఊర్కొండపేట మండలం నర్సంపల్లికి చెందిన ఇర్లపల్లి నీలమ్మ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్ నిఖల్‌రెడ్డి బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ అంత్యక్రియల కోసం రూ.5వేలు పంపగా.. బీజేపీ మండల నాయకులు జనార్దన్‌రెడ్డి రూ.5వేలు, వీర్‌రెడ్డి వెంకట్‌రెడ్డి రూ.2వేలు కలిపి మొత్తం రూ.12వేలను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే కల్వకుర్తి మండలం తుర్కలపల్లిలో సోమవారం మృతి చెందిన శ్రీను కుటుంబ సభ్యులకు ఉప్పల చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తరపున స్థానిక బీఆర్ఎస్‌వీ, బీఆర్ఎస్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5వేల నగదును అందజేశారు. అదేవిధంగా మండలంలోని జిల్లెలలో సోమవారం మృతిచెందిన చిన్న అంజయ్య కుటుంబానికి మాజీ సర్పంచ్ రాములు రూ.3వేలు అందజేశారు. పరామర్శించిన వారిలో నాయకులు గణేశ్, నాగరాజు, ఎల్లయ్య, శేఖర్‌గౌడ్, శ్రీను, సురేశ్, సైదులు, పరశురాములు, మల్లేశ్, మండలాధ్యక్షుడు కురుమూర్తి, ఆర్ఎంపీలు, నాయకులు ఉన్నారు.